# 'గర్భ' గుడి

గుడి నుంచి రాగానే "కొడుకు పుట్టాలనే మొక్కుకున్నారు కదా" అంటూ ఎదురొచ్చింది తాయారమ్మ. 'అవునత్తయ్య.. వ్రతం కూడా చేసుకుంటానని మొక్కుకున్నాను' అంది సంధ్య గుమ్మంలో చెప్పులు విడిచి ఆయాసంగా వాలుకుర్చీలో కూచుంటూ.

"అమ్మా... ఇంతకీ 'వినీల' ఏది ? స్కూలు నించి రాలేదా ?" అంటూ అడిగాడు తల్లిని సుమకాంత్. "వచ్చిందిరా... ఆడుకోడానికి పోయుంటుంది. పిలుస్తానుండు" అంటూ బయటికెళ్లింది తాయారమ్మ.

"సంధ్యా... చేతకావట్లేదా ? ఇంకెంత ? మూన్నెళ్లు... ఆ బాధ తప్పదు. బాబిగాడు పుడితే ఈ బాధలన్నీ గుర్తురావులే..." అంటూ నవ్వుతూ బాత్రూం వైపు పోయాడు సుమకాంత్.

సంధ్య నవ్వింది.

ఆ నవ్వులో జీవం లేదు. భీతి తప్ప !

రోజు రోజుకీ గుండెలో పేరుకుపోతున్న భయం !

బెదురు కళ్లతో పెరుగుతున్న పొట్టవైపు చూసుకొంది. ఆర్తిగా నిమురుకోవాలనున్నా ఏదో అలజడి...

వినీల పుట్టినప్పుడే సుమకాంత్ మొహం మాడ్చుకొని నెలరోజులు సరిగా మాట్లాడ లేదు. తాయారత్తమ్మ మాటలకి భయపడి మొదటి బారసాలలో తండ్రి అయిదు తులాల బంగారు గొలుసు వేసాక సుమకాంత్ వినీల నెత్తుకొని ముద్దుపెట్టుకున్నాడు.

బ్రహ్మదేవుడు ఆడవాళ్ల చేతిలో లేని పనికి అర్థం చేసుకునే మనస్తత్వాన్ని మాత్రం మగాళ్లకెందుకివ్వలేదు ??

సంధ్య మనసు పరిపరి విధాలపోతోంది.

"కాఫీ కలుపుకు రానా ?" సుమకాంత్ దగ్గరగా వచ్చి ప్రేమగా అడిగాడు.

"వద్దండి" నవ్వాలని ప్రయత్నిస్తూ నీరసంగా చెప్పింది.

"పోనీ... ఆపిల్స్ తిను. ప్రెగ్నెంట్స్‌కి చాలా మంచివి తెల్సా ?" అంటూ ముక్కలు కట్ చేసి సంధ్య నోట్లో పెట్టాడు". "ఈసారి శ్రీదేవి నర్సింగ్‌హోంలో జాయిన్ చేస్తాను. గతంలో ప్రియ హాస్పిటల్ కల్సిరాలేదు".

ఈజీ డెలివరి కోసం పల్లెలో మన పొలంలో పండిన వడ్లని దంపి బియ్యం పట్టుకురమ్మని కొండయ్యకు లెటర్ రాసాను". ఆపిల్ కట్‌చేస్తూ చెప్తూనే వున్నాడు సుమకాంత్.

ఏమండీ... మళ్లీ ఆడపిల్ల పుడితే ... ?

గొంతుదాకా వచ్చి గరళంలా ఆగిపోతున్న ప్రశ్న. కనుకొనల దాకా నీటి హోరుని తీసుకొస్తున్న ప్రశ్న. తలుపు దగ్గర మమ్మీ అన్న పిలుపుతో తలత్రిప్పి చూసారిద్దరూ.

ప్రక్కింటి కాంతమ్మ చంకలో వినీల... దిగి పరుగుతో సంధ్యను చుట్టేసేదే. కాని చప్పున సుమకాంత్ లాక్కొని "తప్పమ్మా... నువ్వలా ఢీకొంటే అమ్మ కడుపులో తమ్ముడికి దెబ్బ తగలదా ?" అన్నాడు గారాబంగా. వినీల అసహనంగా చూసింది భర్త వైపు.

కాంతమ్మ సంధ్య కడుపుని పరిశీలనగా చూసి "కడుపు ఎత్తుగా లేదు. కాళ్లకి కూడా నీరు రాలేదు. అంటె కొడుకే పుడతాడ్రా సుమకాంత్" అంది.

"అలా అయితే నీకు చీరకొని పెడతాను పిన్నీ" అన్నాడు.

మర్నాడు సుమకాంత్ "ఈ రోజు శ్రీదేవి నర్సింగ్‌హోం కెళ్దాం. అన్ని టెస్టుల్తో స్కానింగ్ కూడా చేయిద్దాం" అన్నాడు. హాస్పిటల్‌కి వెళ్తుంటే పోచమ్మ గుడికి తీసికెళ్తున్న గొర్రెపిల్లలా వణికింది సంధ్య. అయిదారు గంటల తర్వాత అక్కడ... అనుకున్నట్లే జరిగింది.

స్కానింగ్‌లో ఆడపిల్లని రిపోర్ట్స్ వచ్చాయి...

సుమకాంత్ మొహం వాడిపోయింది.

సంధ్య గుండె కవాటాలు తెగి కూలిపోయింది.

ఆనాటి నించి ఇంట్లో సంధ్య పరిస్థితే వేరయింది. అనురాగాలు లేవు, ఆపిల్సు లేవు.

ఆత్మీయతల్లేవు. ఆకలి అంతకంటే లేదు.

అతిగా వున్నది కన్నీళ్లే !! ఆపై వున్నది ఒంటరితనమే !!

నెలలు నిండాయని తెలిసి సంధ్య తల్లిదండ్రులు వచ్చి బిడ్డని చూసి మౌనంగా రోదించారు. తాయారమ్మ టీ నీళ్లిస్తూ పున్నాగనరకం గురించి వర్ణిస్తూ పెదవి విరిచింది. తమ వంశ గుణగణాల్ని విపులీకరిస్తూ వంశోద్ధారకుని కనని సంధ్యనీ, వాళ్లనీ సూటిపోటీ మాటల్తోనైనా సూటిగానే చెప్పింది.

" మా వాడికి ప్రమోషన్ రాబోతుంది. వాడు మొండివాడు. కొడుకు పుట్టకపోతే మరో పెళ్లాన్నయినా తెచ్చుకుంటాడు...."

అప్పుడే వచ్చిన సుమకాంత్ అత్తామామల్ని నిర్లక్ష్యంగా చూసి గదిలోకెళ్లాడు. పావుగంటలో బ్రీఫ్‌కేసుతో వచ్చి... "నేను క్యాంపు వెళ్తున్నాను. అబిదాబేగం అనే ఆర్ఎంపి డాక్టరుంది. ఆమె దగ్గర మీ కూతుర్ని డెలివరీకి జాయిన్ చేయండి" అని రెండు వంద రూపాయల నోట్లని మామ చేతిలో పెట్టి వెళ్లిపోయాడు.

సంధ్య ఏడ్పుని ఆపటం ఎవరితరమూ కాలేదు.

బేలగా చూస్తుండిపోయింది వినీల.

మూడోరోజున పురిటినొప్పులు లేవగానే ఆటోలో సంధ్యని అబిదాబేగం హాస్పిటల్‌కి తరలించారు. చిక్కిపోయిన సంధ్యకి కాన్పు అతి కష్టమైంది.

ప్రసవంలో అంతకంటె చిక్కిపోయిన... మగబిడ్డ !!!

డాక్టర్ అబిదా "ఈమె బేలన్స్‌డ్ డైట్ తీసుకోక బిడ్డ ఇలా పుట్టింది. ఈ పసిగుడ్డుకి ఆక్సిజన్ అత్యవసరం. నా దగ్గర అవేవీ లేవు. వెంటనే శ్రీదేవి నర్సింగ్‌హోంలో చూపించండి' అని చెప్పింది.

ఆదరబాదరాగా ఆటోల్లో తల్లినీ, పసిగుడ్డునీ తరలించారు.

సుజుకీ మీద గంటన్నరలో ఆస్పత్రి చేరుకున్న సుమకాంత్... డాక్టర్ మాటవిని గుమ్మంలోనే ఆగిపోయాడు.

"సరైన పోషకాహారం లేక బిడ్డ పరిస్థితి ఇలా అయింది. ఆక్సిజన్ కిట్‌లో వుంచినా లాభం లేకపోయింది. సారీ" నిర్జీవమైన పసిగుడ్డునందిస్తూ డాక్టర్ పెదవి విరిచింది.

అపుకున్న దుఃఖం కట్టలు తెగి బిగ్గరగా రోదిస్తున్న సంధ్యని దగ్గర తీసుకున్నాడు సుమకాంత్. సంధ్య కళ్ళు తుడిచే ధైర్యం కూడా లేక తలొంచుకుని వుండిపోయాడు.

* * *